## సంబురంగా పూల పండుగ



కోర్టు ఆవరణలో బతుకమ్మ అడుతున్న మహిళలు

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 19: ప్రకృతి పూల పండుగ బతుకమ్మ అని సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురాం అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో గురువారం బతకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకొనే పండుగ బతుకమ్మ అన్నారు. బతుకమ్మ వేడుకల్లో జడ్జిలు భవాని, స్వాతిరెడ్డి, మిలింద్ కాంబ్లీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, దేవునూరి రవీందర్, ఆత్మా రాములు, రాజిరెడ్డి, రాములు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

## 'బతుకమ్మ' చీరలతో ఆటపాట



బతుకమ్మ ఆడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేట, అక్టోబర్ 19: ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో మాత్రమే పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు అన్నారు. బతుకమ్మ సంబురాల్లో భాగంగా గురువారం 24వ వార్డులో మహిళా సమైక్య భవనం(చిల్డ్రన్ పార్కు)లో వార్డు మహిళలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం అందించిన చీరలను కట్టుకొని బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆడబిడ్డల కోసం చీరలను బతుకమ్మ కానుకగా అందిస్తున్నదని తెలిపారు. బతుకమ్మ పండుగకు ప్రతి ఏడాది నిధులు కేటాయిస్తూ పండుగను సంతోషంగా జరుపుకునేలా చూస్తున్నదన్నారు. కార్యక్రమంలో వార్డు ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

## శాకాంబరిగా అమ్మవారు



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 19: దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల పరిధిలోని భట్టిరామన్నపల్లి గ్రామంలో నెలకొల్పిన అమ్మవారు గురువారం శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలి


సిద్దిపేట కమాన్, అక్టోబర్ 19: వానకాలం సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం సేకరణను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమగ్ర ప్రణాళికతో చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయంలో సంబంధిత అధికారులు, మిల్లర్ల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తెచ్చిన ధాన్యానికి మద్దతు ధర అందేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 3.78 లక్షల ఎకరాల్లో వరి సాగైందని, 9,57,375 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా ఉండగా రైతుల అవసరాలు, ఇతరత్రా బహిరంగ కొనుగోళ్లు పోనూ 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో 420 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్యాడీ క్లీనర్లు, వేయింగ్ స్కేల్, మాయిశ్చర్ మీటర్, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా అవసరమైన గన్నీ బ్యాగులను సమకూర్చాలన్నారు. సేకరించిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్ మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లా మేనేజర్ హరీశ్, జిల్లా పౌరసరఫరాల అధికారి తనుజ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జయదేవ్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా రవాణా అధికారి జనార్దన్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, మెప్మా అధికారి హన్మంతరెడ్డి, రైస్ మిల్లర్ల ప్రతినిధులు, తదితరులున్నారు.



మంగోల్ వద్ద నిర్మించిన మంచినీటిని శుద్ధి చేసే ప్లాంటు

# భగీరథ ప్రయత్నం

**మంచి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం ■ మంగోలు వద్ద భారీ నీటిశుద్ధి ప్లాంట్ ఏర్పాటు**



- మంగోలు వద్ద నీటిశుద్ధి ప్లాంట్ ఏర్పాటు
- రూ.1,212కోట్లతో నిర్మాణం
- ఆరు జిల్లాలకు ఇక్కడి నుండే నీటి సరఫరా
- 872 గ్రామాలకు ప్రారంభమైన శుద్ధినీటి సరఫరా

*గజ్వేల్, అక్టోబర్ 19: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆలోచనతో పుట్టిన మిషన్ భగీరథ పథకం గజ్వేల్ మండలం కోమటిబండ వద్ద 2016, ఆగస్టులో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం కేసీఆర్ చేతుల మీదుగా పురుడుపోసుకున్నది. తెలంగాణలోనే మిషన్ భగీరథ పథకం ప్రారంభంతో దేశవ్యాప్తంగా సీఎం కేసీఆర్‌కు మంచి పేరు తీసుకువచ్చింది. కేంద్రప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకున్నది. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా కొండపాక మండలం మంగోల్ వద్ద భారీ నీటిశుద్ధి ప్లాంట్‌ను రూ. 1,212 కోట్లతో నిర్మించారు. ప్రతి ఏడాది 10 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం శుద్ధిచేసి ఆరు జిల్లాల్లోని 12 నియోజకవర్గాలకు రోజూ పంపిణీ చేసే విధంగా నిర్మించారు. ఇప్పటికే 872 గ్రామాలకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్నారు.*

మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి ఏటా 10 టీఎంసీల నీటిని వినియోగించుకోవడం కోసం ఈ ప్రాజెక్టును నిర్మించారు. ప్రస్తుతానికి గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాలకు కొండపాక మీదుగా హైదరాబాద్ వెళ్తున్న హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ అండ్ స్టోరేజీ బోర్డు(హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) ఫేజ్-1 పథకం పైప్‌లైన్‌కు గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ వద్ద రాజీవ్ రహదారి పక్కన లింక్ చేసి గజ్వేల్ మండలం కొమటిబండ గుట్ట పైన నిర్మించిన సంపులలోకి నీటిని మళ్లిస్తారు. అక్కడి నుంచి ట్యాంకుల్లోకి నీటిని పంపింగ్ చేసి గ్రామాల్లోని ఇండ్లకు శుద్ధిచేసిన మిషన్ భగీరథ నీటిని రోజూ సరఫరా చేస్తున్నారు.

### 872 గ్రామాలకు శుద్ధినీటి సరఫరా

సిద్దిపేట జిల్లాలోని తొమ్మిది మండలాల పరిధిలోని 221 గ్రామాలు, జనగామ జిల్లాలోని జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లోని 11 మండలాల పరిధిలోని 569 గ్రామాలు, సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి యూఎల్‌బీ పరిధిలోని రెండు మండలాల్లోని 47గ్రామాలకు అదే విధంగా మహబూబాబాద్ జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో 35గ్రామాలకు శుద్ధి చేసిన నీటిని ప్రతి రోజు సరఫరా చేస్తున్నారు. మొదటి విడతలో నాలుగు జిల్లాల పరిధిలోని 23మండలాల్లో 872గ్రామాలకు మల్లన్నసాగర్ నుంచి శుద్ధి చేసిన నీటిని అందిస్తున్నారు.

## 1922 గ్రామాలకు లబ్ధి

కొమురవెల్లి మల్లన్నసాగర్ ప్రాజెక్టు వద్ద నిర్మించిన మంచి నీటి శుద్ధి ప్లాంట్ నిత్యం గ్రామీణ ప్రాంతాల్లో దాహార్తి తీర్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నది. కొండపాక మండలం మంగోల్ వద్ద మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో నీటిని శుద్ధి చేసే ప్లాంట్‌ను నిర్మించారు. తెలంగాణలోని ఆయా జిల్లాలకు గోదావరి జలాలను సరఫరా చేసేందుకు రెండు చోట్ల ఒక మెగావాట్ సామర్థ్యం కలిగిన 6మోటర్ల చొప్పున 12 మోటర్లను బిగించారు. ఇందులో ఒక్కో చోట నాలుగు మోటర్లను వినియోగిస్తున్నారు. మిగతావి అదనంగా స్టాండ్‌బై చేశారు. రూ.1,212కోట్ల వ్యయంతో చేపట్టిన ప్లాంట్‌తో ఆరు జిల్లాలకు తాగునీటిని సరఫరా చేసే వీలుంటుంది. ఇక్కడి నుంచి సిద్దిపేట, జనగాం, భువనగిరి, మేడ్చల్, మెదక్, సూర్యపేట జిల్లాలకు నీటిని పంపిణీ చేయనున్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి తీసుకున్న మంచినీటిని శుద్ధి చేసి 12 నియోజకవర్గాలైన గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట, జనగాం, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, ఆలేరు, భువనగిరి, మేడ్చల్, తుంగతుర్తి, నకిరేకల్, నర్సాపూర్‌లోని 1,922 గ్రామాలకు రోజూ నీటిని సరఫరా చేసే వీలుంది. ప్రస్తుతం ఉన్న నీటి అవసరాలతోపాటు 2048లో ఉండే తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇక్కడ అతిపెద్ద మంచినీటి ప్లాంట్‌ను ప్రభుత్వం నిర్మించింది. తెలంగాణ ప్రభుత్వ ముందుచూపుతో చేపట్టిన ఈ ప్లాంట్‌తో వచ్చే తరాలకు మంచినీటి కష్టాలకు శాశ్వత పరిష్కారంగా నిర్మాణాలను చేపట్టారు.

## సాఫీగా తాగునీటి సరఫరా

గోదావరి జలాలను ముందుగా కొండపాక మండలం మంగోల్ కేంద్రానికి తరలించి అక్కడి నుంచి లకుడారం వద్ద నిర్మించిన జీఎల్‌బీఆర్(గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)కు తరలిస్తారు. అక్కడి నుంచి ఎడమ, కుడి రెండు పాయలుగా నీటిని తరలిస్తారు. ఎడమ పాయ ద్వారా సిద్దిపేట, జనగాం, పాలకుర్తి, స్టేషన్‌ఘనపూర్‌లో కొంత భాగం, గజ్వేల్‌లో కొంతభాగం, కుడిపాయ నుంచి గజ్వేల్ మండలం అక్కారం పంపింగ్ స్టేషన్‌కు తరలిస్తారు. పంపింగ్ ద్వారా మెదక్ జిల్లా నర్సాపూర్, శామీర్‌పేట మండలం ఘన్‌పూర్, గజ్వేల్ మండలం కొమటిబండ, గజ్వేల్‌లోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, దుబ్బాక, ఆలేరు, భువనగిరి, మేడ్చల్ సెగ్మెంట్లకు తాగునీటిని సరఫరా చేయనున్నారు.



## పండుగ వేళ షాపింగ్ సందడి

*బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని సిద్దిపేట పట్టణం కొనుగోలుదారులతో సందడిగా మారింది. సుభాష్ రోడ్, గాంధీ రోడ్‌తోపాటు లాల్ కమాన్, మెయిన్ రోడ్డులోని షాపింగ్ మాల్స్, బ్యాంగిల్ స్టోర్స్, వివిధ దుకాణాలు కిక్కిరిసిపోతున్నాయి. యువకులు మెన్స్‌వేర్‌లలో వారికి నచ్చిన దుస్తులు కొనుగోలు చేస్తుండగా.. ఆడబిడ్డలకు ఇష్టమైన బతుకమ్మ పండుగ కోసం మహిళలు అభరణాలు, బ్యాంగిల్స్ కొనుగోలు చేస్తున్నారు. పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి నిత్యం ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి షాపింగ్ చేస్తున్నారు.*

*- సిద్దిపేట కమాన్, అక్టోబర్ 19*





